# వైరస్

కాలేజి నించి వస్తూనే గదిలోకి వెళ్లిన దీప, 'మమ్మీ' అంటూ తేలు కుట్టినంత గట్టిగా అరచి వంటింట్లో టీ చేస్తున్న తల్లి దగ్గరికి పరిగెత్తినట్టే వెళ్ళింది. 'మమ్మీ' - నా గదిలో - నా పక్క మీద ఎవరు పడుకున్నారు?' కోపంగా అరిచింది. 'ష్! అరవకు. మీ అత్తయ్య అమెరికా నుంచి యిండియా వచ్చిందని చెప్పాగా-ఇవాళే వైజాగ్ నించి వచ్చింది. భోంచేసి పడుకుంది' అంది నెమ్మదిగా సుమిత్ర.

దీప మొహం ఎర్రబడింది. 'వస్తే, నా గదిలో ఎందుకు పడుకోబెట్టావు. నాకు డిస్ట్రబెన్స అని నీకు తెలియదా. గదంతా పెట్టెలు, టేబిల్ అంతా సామాన్లు - నేను ఎలా చదువుకోవాలి. ముందవన్నీ తీసెయ్' - గొంతు తగ్గించినా కఠినంగానే అంది.

'నోర్మూయ్. ఏమిటా మాటలు. మీ అత్త వింటుంది. బుద్ధి లేకుండా మాట్లాడకు. యింకెక్కడ పెట్టమంటావు సామాన్లు నీ గదిలో కాక - మీ నాన్న గదిలో పెట్టాలా, నీ అన్న గదిలో పడుకోబెట్టనా. రెండు రోజులు సర్దుకోలేవా. మరీ మనిషి పొడగిట్టకుండా పోతుంది నీకు' చాలా కోపంగానే జవాబిచ్చింది సుమిత్ర.

దీప మొహం మాడ్చుకుని ఏదో అనబోయేలోగా వెనక నుంచి మాలతి దీప భుజం మీద చెయ్యేసి, 'హాయ్ దీపా, ఎలా వున్నావు. ఎన్నాళ్లయిందీ నిన్ను చూసి, పొడుగయ్యావు. పెద్దదానివయిపోయావు'. అంటూ మేనకోడలిని హత్తుకుని ప్రేమగా బుగ్గ మీద ముద్దు పెట్టింది.

దీప బలవంతంగా నవ్వి. 'హాయ్ ఆంటీ హౌ ఆర్ యూ' అంటూనే మేనత్త చేతుల్నించి తప్పించుకుని గదిలోకి వెళ్ళిపోయి ధబాలున తలుపు మూసుకుంది.

'ఏమిటీ దీప మూడ్ బాగులేనట్టుంది. ధుమధుమ లాడుతుంది' మాలతి నవ్వుతూ వదినగారితో అంది.

'ఆవిడగారి మూడ్ ఎప్పుడూ అంతేలే-ప్రతిదానికి కస్సు బుస్సులాడుతూనే వుంఉటంది' మాట తప్పించింది సుమిత్ర.

'ఏమిటి దాని గది నేను ఆక్రమించానని కోపం వచ్చిందా. ఏదో అరుస్తూంది యిందాక' - ఆరా తీసింది. చూపు తప్పించి తేలిగ్గా నవ్వి, 'ఆ, దానికోపానికేంలే. యీ

కాలం పిల్లలు మరీ......... తయారవుతున్నారు. మనిషి పొడగిట్టకుండా పోతోంది. ఒక్కొక్కరికి ఓ గది కావాలంటే ఎక్కడొస్తాయి - యిరవై నాల్గుగంటలు గదుల్లో తలుపులు బిడాయించి కూర్చోడాలు ఎక్కువయ్యాయి, వీళ్ళకి'

'పోనీలే వదినా సామాన్లు మీ గదిలో పెట్టేస్తాను-రాత్రి డ్రాయింగు రూములో పడుకుంటాను. దాన్ని డిస్టర్బ్ చేయడం ఎందుకు, ఈ కాలం పిల్లలు వాళ్ల ప్రైవసి వాళ్ళకి కావాలంటారు' - మాలతి సరద్ది చెప్పబోయింది.

'నీవూరుకో మాలతీ, దాని మాటలు లెక్కచెయ్యకు. రెండు రోజులు సర్దుకోలేదా ఏమిటి - పద టీ తాగుదాం'.

యిద్దరూ చెరో కప్పు పట్టుకుని డ్రాయింగు రూములో కూర్చున్నారు. 'ఏమిటో మాలతీ, ఈ కాలం పిల్లలు మరీ టచ్‌మీ నాట్‌లా వంటెద్దు గుణాలతో తయారవుతున్నారు. సర్దుబాటు తనం, షేరింగ్ అన్నవి లేకుండా వుంది. వాళ్ళాడించినట్లు మనమూ ఆడుతూంటే మరీ వేషాలెక్కువవుతున్నాయి. ఏదో ఒకరు యిద్దరు పిల్లలు గదా, వాళ్ళకి అన్ని కంఫర్ట్స్ యిస్తే బాగా చదువుకుంటారు. మనలా వాళ్లు దేనికి అవస్థ పడకూడదు, అన్న మన ఆలోచనల్ని ఎక్స్‌ప్లాయిట్ చేస్తున్నారనిపిస్తూంది' - సుమిత్ర అప్రసన్నంగా అంది.

'మా అమెరికాలోనే అనుకున్నాను. యిక్కడా యిలాగే వున్నారన్న మాట. అవును మాకు బంధువులు రాకపోకలు ఉండవు కనక పరావాలేదనుకో - మన రోజుల నాటి బంధుత్వాలు, ఆప్యాయతలు యీ కాలం వాళ్ళకి లేవు. ఏమిటో ఫారెనర్సే అనుకుంటే మన వాళ్ళూ అలాగే తయారవుతున్నారు'.

'ఆ...ఇండియా అమెరికా తాతలా తయారవుతూంది. ఇక్కడా కాస్త ఉన్నవాళ్ళకి మినిమమ్ మూడు బెడ్ రూమ్‌ల ఫ్లాట్, అందరికి తన గది - అది అలవాటయి మనిషి పొడ గిట్టకుండా వుంది. తన గది, తన టి.వి. ఆపైన కంప్యూటర్లు - తలుపులు మూసుకుని గంటల తరబడి యింటర్నెట్‌లూ ఛాటింగు - వీళ్ళకిప్పుడు మనుష్యులక్కరలేదు. చదువులకి రోజంతా కాలేజి, ఆ తర్వాత గదిలో తలుపులు బిడాయించుకోడం. మన చిన్నతనంలో చుట్టాలొస్తున్నారంటే ఎంత సంబరపడేవారం-శలవులొస్తే అంతా పుట్టింటి కెళ్ళడం-పిన్నులు, కజిన్స్, మామయ్యలు, అత్తయ్యలు, అక్కచెల్లెళ్లం కలవడం ఎంత సరదాగా వుండేది. కజిన్స్ అన్నమాటే లేదు యిప్పుడు' - వెనుకటి రోజులు తలుచుకు ఎమోషనల్‌గా అంది సుమిత్ర.

'నిజం వదినా, అందరికి ఆరేడుగురు సంతానం తక్కువ వుండేది కాదు మన

వాళ్ళకి. సెలవులొస్తే పుట్టింది కెళ్ళేవారం - యింటి నిండా పాతిక మంది పెద్ద పిల్లలు చేరేవారం. పిల్లలంతా పెరట్లో చెట్లంబడి ఎన్ని ఆటలాడేవాళ్లం - పెద్దలంతా కల్సి ఎన్ని రకాల పిండివంటలు చేస్తూ తీరిక లేకుండా వున్నా ఏనాడు ఎవరూ విసుక్కోలేదు. ఏం తినేవాళ్ళమో, ఎక్కడ పడుకునే వాళ్ళమో, కల్సి మెల్సి వుండేవారం. ఎండాకాలం అయితే యింత మందీ డాబామీదికి చేరేవారం. లేదంటే పెరట్లో పక్కలేసుకునేవాళ్ళం. మడతమంచాల మీద, నవారు మంచాల మీద, శీతాకాలం శలవలయితే హాల్లో కింద వరసగా పక్కలు - పిల్లలంతా ఓ పంక్తి భోజనం, మగాళ్ళంతా ఓసారి, ఆఖర్న కబుర్లాడుకుంటూ ఆడవాళ్ళు భోజనాలు, ఒకరు పిల్లలకి నీళ్ళు పోస్తే, యింకొకరు జడలు వేసేవారం. ఇంకోరు చద్దన్నాలు పెట్టడం - నీ పిల్ల నా పిల్ల అన్న తేడాయే వుండేది కాదు. దొడ్డమ్మ పిన్ని, అత్త అంటూ ఆ పిలుపులు ఎంత బాగుండేవి, ఆ రోజులు - యిప్పుడేమిటి ఒక్క మనిషిఅ వస్తే యిల్లు యిరుకన్నట్టు ఫీలయిపోతున్నాం' - పాత జ్ఞాపకాలతో ఉద్విగ్నంగా అంది.

'ఇల్లు కారు మాలతీ యిరుకు - మనసులు యిరుకయిపోయాయి. ఆ మధ్య ఓ మంచి కథ - ఇదే కథా వస్తువుతో ఎంత బాగా రాసిందో తెలుసా - అపుడు యింట్లో మనుషులుండేవారు. మమకారాలుండేవి. ఒకరికోసం ఒకరు సర్దుకునేవారు. యిప్పుడు యింటి నింద ప్రాణం లేని వస్తువు లెక్కువయ్యాయి. అవి ఎలా సర్దుకుంటాయి. అప్పుడు ఇల్లు చిన్నదైనా ఎంత మంది వచ్చినా సరిపోయేదంటే రాత్రిళ్ళు పక్కలు పరుచుకు తెల్లారి మంచాలెత్తేసి బయట పడేస్తే హాలంతా ఖాళీ. భోజనాలయ్యాక పీటలెత్తేస్తే భోజనం హాలంతా ఖాళీ - అందరి సామానులు ఒక గదిలో పెట్టుకునే వారు. యిప్పుడలా కాదు కదా. ప్రతి గదిని రెండు మంచాలక్రమిస్తాయి - డ్రాయింగు రూము నిండా సోఫాలు, డైనింగ్ రూమునిండా డైనింగ్ టేబిల్, కుర్చీలు, ఫ్రిజ్‌లు - మంచాలు, బీరువాలు. ఏ సామాను కదలదుగదా వున్న చోటి నుంచి. మరి చోటెక్కడనించి వస్తుంది? కొత్తవారికి? ప్రతివాళ్ళకి సుఖాలు అలవాటయ్యాయి. ప్రతి వాళ్ళు మెటీరియల్‌స్టిక్ అయిపోయి సర్దుబాటు తత్వం లేకుండా పోయింది. కుటుంబం అంతా భార్య భర్త పిల్లలు మాత్రమే అనుకునే ధోరణి వచ్చేసింది. మనం ఎంజాయ్ చేసినట్టు ఈ తరం ఏం ఆనందంగా గడుపుతున్నారు. ప్రాణం లేని ఆ కంప్యూటర్‌తో మాట్లాడుకుంటూ అదే లోకం, ఆనందం అనుకుంటున్నారు కుర్రకారు. సెంటిమెంట్లకి దూరమయి పోయిందీ తరం' - నిట్టూరుస్తూ అంది సుమిత్ర.

చిన్ననాటి ముచ్చట్లు మాట్లాడుకుంటూ కూర్చున్నారిద్దరూ చాలాసేపు

* * *

రాత్రి రోజూ వంటిగంట వరకు చదువు, తర్వాత యింటర్నెట్‌లో చాటింగులు, బ్రౌజింగులు చేసే దీప ఆ రోజు అలిగినట్టు అన్నంతిని పది గంటలకే ముసుగు బిగించేసింది. డైనింగ్ టేబుల్ దగ్గర సరదాగా మాలతి ముచ్చట్లు చెపుతుంటే మాటలు కలపలేదు. బలవంతాన అపుడపుడు ఓ నవ్వు, ఊ - అలాంటి పొడి మాటలతో సరిపెట్టింది. దీప ధోరణికి సుమిత్ర వళ్ళు మండినా ఏదన్నా అంటే ఎదురుచెబితే ఆడ పడుచు ముందు పరువుపోతుందన్నట్టు సహించి వూరుకుంది. ఒకటి రెండుసార్లు కళ్ళు పెద్దవి చేసి అప్రసన్నత తెలియచేసినా దీప చూసీ మొహం తిప్పుకుంది. మగపిల్లాడు దీక్షిత్ నయం 'అత్తయ్యా' అంటూ అమెరికా కబుర్లు చెప్పించుకున్నాడు.

ఆ రోజు మాలతి, సుమిత్ర షాపింగుకి వెళ్ళి చీకటి పడ్డాక యింటికి తిరిగి వచ్చారు. దీప గదిలో లైటు వెలుగుతోంది. కొన్న సామాను గదిలోపెట్టి రావడానికి మాలతి లోపలి కెళ్ళింది. దీప గదిలో లేదు. కంప్యూటర్ ఆన్‌లో వుంది. బాత్‌రూములో ఫ్లెష్‌లాగిన చప్పుడు. స్క్రీన్ మీద అక్షరాలు, ఎవరితోనో ఇంటర్నెట్‌లో మాట్లాడుతూ మధ్యలో బాత్‌రూముకి వెళ్లినట్టుంది అనుకుంటూ యధాలాపంగా స్క్రీన్ వైపు చూసింది. 'సారీ రాహుల్ నిన్న నీతో మాట్లాడలేకపోయాను. ఐ,నో,నా కోసం చాలా సేపు వెయిట్ చేసి వుంటావు, ఏం చెయ్యను - నిన్న మా ఇంటికి ఓ గెస్ట్ వచ్చి నా గదిలో తిష్ఠ వేసింది. నా పాలిటి 'ఘోస్ట్' అనుకో. నిన్న ప్రైవసీ లేకపోయింది. ఇదిగో యిప్పుడే వచ్చా. ఇందాకటి నించి నీకోసం ట్రై చేస్తున్నాను - నీవు దొరకడం లేదు - కమ్ రాహుల్ క్విక్ అయామ్ వెయిటింగ్ ఫర్ యూ, మళ్లీ ఆ ఘోస్టు వచ్చిందంటే మాట్లాడడం కుదరదు' - ఇంగ్లీషులో ప్రింటయివున్నది చదివి మాలతి తెల్లపోయింది. తాము అప్పుడే రామనుకుంది కాబోలు, రాహుల్ జవాబు వచ్చేలోగా టాయిలెట్ వెళ్ళినట్టుంది. మాలతి తెల్లబోయి చూస్తుండగానే దీప ఎప్పుడొచ్చిందో మాలతి తన ఇ మెయిల్ చదువుతుందని చూడగానే 'ఆంటీ' అంటూ చాలా ఆవేశంగా ఒక్క కేక పెట్టి కంప్యూటర్ ఆఫ్ చేసి, 'ఆంటీ, వాట్ ది హెల్ ఆర్ యూ డూయింగ్. ఇలా యింకోరి యీ మెయిల్ చదువుతున్నావా రియల్లీ... యూ...యూ' ఆవేశంతో మాటలు తడబడ్డాయి - మొహం ఎర్రబడింది. 'నీకింత మేనర్స్ లేదనుకోలేదు' - భీత్కారంగా అంది. మాలతి నిర్ఘాంతపోయింది ఆ కోపానికి. బిత్తరపోయి చూస్తూ, 'వూరికే అలా చూసా...యిపుడే వచ్చా...' సంజాయిషీ యిస్తున్నట్టు గొణిగింది.

'ఊరికే చూసావా, అబద్ధాలాడకు - చదవలేదూ, నీవు చదివావని తెల్సు నాకు' తీవ్రంగా అంది. మాలతి తేరుకుని 'ఎందుకకే అంత కోపం, అలా అరుస్తావెందుకు, సామాను పెడ్డామని గదిలోకి వచ్చేసరికి, అలా కంప్యూటర్‌మీద అక్షరాలు కనిపిస్తే చూశానంతే...' ఏదో చెప్పబోతుంటే కేకలు విని సుమిత్ర గదిలోకి వచ్చింది - 'ఏమయింది

'ఏమిటా కేకలే?' - కూతురి వంక కోపంగా చూస్తూ అంది. దీప మొహం మాడ్చుకుని చుర చుర మాలతి వంక చూసింది. అప్పటికి మాలతి పూర్తిగా తేరుకుని, 'ఏం లేదు వదినా, దాని యీ మెయిల్ చదివానని కోపం, చదవాలని చదివానా - రూములోకి వచ్చేసరికి అది బాత్‌రూమ్‌లో వుంది. స్క్రీన్ మీద అక్షరాలు కనిపిస్తే అలా చూస్తుంటే ఇది వచ్చి వేగంగా చిందులు తొక్కుతూంది' - జరిగిన అవమానానికి కోపం తెచ్చుకోకుండా చిన్న పిల్ల దాంతో నాకేమిటన్నట్టు తేలిగ్గా అంది. సుమిత్ర తీవ్రంగా బుద్ధిలేదు అన్నట్లు చూసి, 'చూస్తే ఏం అయింది. గదిలోకి వచ్చినవాళ్ళు కళ్ళు మూసుకుంటారా, మతి సుతి లేకుండా పోతుంది. రోజు రోజుకీ - పెద్ద చిన్న లేకుండా ఏమిటా అరుపులు...'

'గదిలోకి వస్తే ఫరవాలేదు. ఇంకొకరి ఇ-మెయిల్ చూడడం ఎందుకు?' ఉక్రోషంగా అంది.

'అది కాదు వదినా దాని అసలు బాధంతా - నేను దాని గది ఆక్రమించిన గెస్ట్‌ని కాదు, ఘోస్టునని దాని బాయ్‌ఫ్రెండుకి చెప్పుకుంది-అది నేను చూశానని' మాలతి నవ్వింది.

'మరి ఊరికే చూసానన్నావు. చదివావన్నమాట. నికామేనర్స్ ఏమయ్యాయి, మళ్ళీ అమెరికాలో వుంటున్నావు' తిరస్కారంగా చూస్తూ అంది దీప.

మాలతి మొహం మాడిపోయింది - 'ఏమిటి, ఏమయింది' అపుడే ఆఫీసు నించి వచ్చిన హరికృష్ణ లోపలికి తొంగి చూస్తూ అడిగాడు.

'మీ ముద్దుల కూతురి వ్యవహారం శ్రుతి మించి తూంది. నోరు కాస్త సంబాళాంచుకోమని చెప్పండి. పెద్ద చిన్నా లేకుండా మీ చెల్లెల్ని నోటికొచ్చినంటూంది. అసలు మిమ్మల్ని అనాలి. కంప్యూటర్లు, యింటర్నెట్‌లు అన్నీ అమర్చి వాళ్లని పాడు చేస్తున్నందుకు' - మొగుడి మీద ఎగిరి పడింది సుమిత్ర.

'ఏమయింది యింతకి', అసహనంగా అడిగాడు - సుమిత్ర కోపంగా జరిగింది చెప్పింది. యింటికి చుట్టపు చూపుగా నాల్గు ఏళ్ళ తరువాత వచ్చిన చెల్లెల్ని, అంత పొగరుగా మంచి మర్యాద లేకుండా మాట్లాడింది అన్నది వినగానే హరికృష్ణ మొహం ఎరుపెక్కింది. కూతురి వంక తీక్షణంగా చూసాడు.

'తన మేనర్స్ సంగతి సరే, యింటికొచ్చిన బంధువుని, నీ కంటె పెద్దదాన్ని మేనత్తని, అవమానపరిచే నీ మేనర్స్ సంగతి చెప్పు. ఫస్ట్ సే సారీ టు హర్' కఠినంగా అన్నాడు. తండ్రి మొహంలో అంత కోపం చూడని దీప కాస్త బెదిరింది మనసులో - అయినా

బింకంగా 'షి షుడ్ సే సారీ టు మి, నా ఇ-మెయిల్ చదివినందుకు' అంది. ఈసారి యింకా కోపంగా చూసి కఠినంగా, 'సే సారీ ఫస్ట్' అన్నాడు వేలు చూపిస్తూ బెదిరిస్తూ 'తనేం చేసినా యు హావ్ నో బిజినెస్ టు టాక్ టు హర్ లైక్ దిస్, షియీజ్ మై సిస్టర్ అండ్ మై గెస్ట్ - రెండు నిమిషాలలో తనకి క్షమాపణ చెప్పకపోతే యీ కంప్యూటర్ విసిరిపారేస్తాను. ఐమీన్ ఇట్' అన్నాడు.

'ఊరుకో అన్నయ్యా - ఏదో చిన్నతనం...' మాలతి సర్దబోయింది.

'నీ వూరుకో మాలతీ, దానికీమధ్య బుర్రతిరుగుడెక్కువయ్యింది. ఆయన అంత పట్టించుకోరని మరీ మితిమీరుతుంది. నన్నడిగితే అసలు రెండు తగలనియ్యాలి యిలాంటి వాళ్ళకి' - సుమిత్ర కోపంగా

'ఊ - అత్తయ్యకి సారీ చెప్పు - ఈ రోజు నించి నీవు హాలులో పడుకో అత్తయ్య వున్నన్ని రోజులు, నీకు మనిషి పాడగిట్టకపోతే'

తండ్రిలో అంత కోపం ఎన్నడూ చూడని దీప కళ్ళలో నీరు తిరిగింది. 'అవును నే చేసిందే తప్పు మీకు...తను చేసింది..'

'నో మోర్ టాకింగ్, జస్ట్ సే సారీ' హుంకరించాడు హరికృష్ణ - దీప మొహం నల్లబడి కళ్ళు వాల్చుకుని 'సారీ' అంటూ మాలతి వంక తిరస్కారంగా చూస్తూ అని విసురుగా చెప్పులు వేసుకుని బయటికి వెళ్ళిపోయింది.

'ఎందుకొచ్చిన గొడవ అన్నయ్యా, యీ కాలం పిల్లలంతా యిలాగే వున్నారు. చెప్పిన మాట వినడంలేదు - మా అమెరికాలోనే అనుకున్నా, యిక్కడా యిలాగే తయారవుతున్నారు. గట్టిగా ఏం అనడానికి లేదు. అంటే ఏం చేస్తారోనని భయం, ఈ చీకట్లో అలా బయటికి వెళ్ళిపోయింది. ఆడపిల్ల..'

'మరేం అయిపోదు ఆడపిల్లలు ఆడపిల్లల్లా వున్నారా యిప్పుడు. ఏదో పోనీ ఒకరిద్దరు పిల్లలు - ఆడ మగ తేడా లేకుండా ప్రొఫెషనల్ కోర్సులు చెప్పించి వాళ్ళకి ఆర్థిక స్వాతంత్ర్యం కలగాలని వాళ్లకి అన్ని సదుపాయాలు సమకూర్చి చదువులు చెప్పిస్తూ వుంటే అడ్వాన్‌టెజ్ తీసుకుంటున్నారు. పెద్ద చిన్న, మంచి మర్యాద అన్నవి మర్చిపోతే ఎలా, అదే వస్తుంది తిరిగి తిరిగి కోపం తగ్గాక' హరికృష్ణ లోపలికి వెళ్ళిపోయాడు.

'సారీ వదినా నా వల్ల యీ గొడవ జరిగింది. ఏదో ఘోస్ట్ అని రాసింది చదివి నవ్వుకున్నాను తప్ప యింత గొడవ చేస్తుందనుకోలేదు'.

'ఏమిటో మాలతీ ఈ యింటర్నెట్లు వచ్చి మేలు మాటలావుంచి కీడెక్కువ జరుగుతుందేమోననిపిస్తుంది. చదువులు పక్కన పెట్టి యిదే గోలయింది'.

ఓ గంట ఎటో తిరిగి ఏడ్చినట్టున్న మొహంతో వచ్చిన దీపని ఎవరూ పలకరించలేదు. అన్నానికి పిలిస్తే రాకుండా గదిలో కూర్చుని పది గంటలకి తలగడ తెచ్చుకుని సోఫాలో పడుకుంది, మాలతి వారిస్తున్నా వినకుండా.

* * *

ఇది జరిగి నాలుగేళ్ళయింది. దీప కంప్యూటర్ ఇంజనీరింగు పూర్తి చేసి ఎమ్మెస్ చేయడానికి అమెరికా వెడుతూంది.

'అత్తయ్య ఎయిర్‌పోర్ట్‌కి వస్తుంది. తను వచ్చేవరకు అక్కడే వుండు. గాభరాపడద్దు. అన్నీ తను చూసుకుంటానంది' - ఆఖరి నిమిషంలో హరికృష్ణ ఒంటరిగా అమెరికా వెళ్తున్న కూతురికి అప్పగింతలు పెట్టాడు. భారవమైన మనసుతో వీడ్కోలు చెప్పారు - సుమిత్ర, హరికృష్ణ.

'థాంక్ గాడ్', అనుకుంది ప్లేను ఎక్కాక నిశ్చింతగా - అసలు తన అమెరికా ప్రయాణం ఉంటుందో లేదో ఎంత టెన్షన్ ఫీలయ్యింది. ఎయిడ్ రావడం కష్టంగా వుందంట. ఆడపిల్ల ఏం అవస్థలు పడుతుంది. ఇక్కడా మంచి ఉద్యోగాలే దొరుకుతున్నాయి. అమెరికా వెళ్ళకపోతే ఏం కొంపమునగదు అని హరికృష్ణ మొండికేశాడు. దీప ఇంజనీరింగ్‌లో చేరేవేళకి కంప్యూటర్ యింజనీరింగ్‌కి గిరాకి వుండేది. ఆమె చదువు పూర్తయ్యేసరికి నాలుగేళ్ళలో పరిస్థితులు మారాయి. సెప్టెంబర్ 11 తరువాత సంఘటనతో ఎంతోమంది కంప్యూటర్ ఇంజనీర్లు ఉద్యోగాలు పోవడం - యూనివర్శిటీల్లో ఎయిడ్ దొరకడం కష్టం అవడంతో హరికృష్ణ ఆడపిల్లని యీ పరిస్థితిలో పంపలేనని వాదించాడు. మొదటి సెమిస్టరు ఫీజు, టిక్కట్టు, ఇతర ఖర్చులకి 3 లక్షలకి సిద్ధమే. కాని తరువాత ఎయిడ్ దొరక్కపోతే... 'పరవాలేదు - ఎలాగో మేనేజ్ చేస్తాను. వెళ్ళిన మా సీనియర్స్ అంతా ఇంటర్నెట్‌లో చెప్పారు. మరేం ఫరవాలేదు దొరుకుతుందన్నారు. మీకెందుకు నేను చూసుకుంటాను వెళ్ళాక' - దీప మొండి కేసింది. అమెరికా కల ఎక్కడ భగ్నం అవుతుందోనని బెంగ ఆమెకి. అలాంటి స్థితిలో మాలతి తనున్నాను మరేం ఫరవాలేదు దొరుకుతుందన్నారు. మీకెందుకు నేను చూసుకుంటాను వెళ్ళాక' - దీప మొండికేసింది. అమెరికా కల ఎక్కడ భగ్నం అవుతుందోనని బెంగ ఆమెకి. అలాంటి స్థితిలో మాలతి తనున్నాను మరేం ఫరవాలేదు. నేను చూసుకుంటాను. తనకు ఎయిడ్ రాకపోతే నేను ఖర్చుపెడతాను. మీరక్కడ రూపాయల్లో యివ్వచ్చు - పంపించు అంటూ ధైర్యం చెప్పింది. రెండు మూడు యూనివర్సిటీల్లో సీటు వచ్చినా తనకి దగ్గరని చూస్తూ వుండటానికి, శలవులకి రావడానికి వీలుగా వుంటుందని 'అరిజోనా' యూనివర్శిటీలో జాయిన్ అవమని సలహా ఇయిచ్చింది. ఓ పది రోజులు

ముందు పంపిస్తే పరిసరాలు, వాతావరణం, అలవాటవుతుందని అంటే కాలేజి ఆరంభించడానికి పదిహేను రోజులు ముందు బయలుదేరింది దీప.

'చూశావా, పాపం మాలతి పాత సంగతులు గుర్తుంచుకోకుండా నీ సాయానికి ముందుకు వచ్చింది. అందుకే అంటారు ఎప్పుడెవరితో ఏ అవసరం వస్తుందో, మనుషులన్నాక ఒకరితో ఒకరికి అవసరం వుంటుంది' సుమిత్ర నెమ్మదిగా అంటించింది. దీప కాస్త మొహం ముడుచుకుంది. ఈ నాలుగేళ్ళలో దీపకి కాస్త మెచ్యూరిటీ వచ్చి మారినా ఆ వగరు, పొగరు యింక తగ్గాలి అనుకుంటుంది కూతుర్ని చూసి సుమిత్ర.

'ఉద్యోగం రాగానే ఆవిడ యిచ్చింది నేను యిచ్చేస్తాను-ఒకవేళ నాకు ఎయిడ్ రాకపోతే' ... అంది బింకంగా.

'ఆ సర్లే, ఉద్యోగం మాట తర్వాత ముందు రెండేళ్ళ చదువుందని మరవకు. తనకి అప్పు తీర్చాలంటే మూడు నాలుగేళ్లమాట - అంతవరకు తన డబ్బు బ్లాక్ అవుతందని తెల్సినా తను ఎందుకు సాయం చేస్తుంది.

* * *

'హలో దీపా. వెల్కం టూ యూఎస్' మాలతి ఎయిర్ పోర్టుకి వచ్చి మేకోడలికి స్వాగతం చెప్పి కౌగిలించుకుంది.

'హాయ్ ఆంటీ' ఈసారి మనస్ఫూర్తిగానే అంది దీప.

'హాయ్, అయామ్ హరిత, నన్ను గుర్తుపట్టలేదా' - వెనకనించి భుజం మీద చెయ్యి వేసింది హరిత.

'హరిత!.... అంటే హరిత మీ అమ్మాయి గాదూ - పదేళ్ళప్పుడు చూశాను. కిందటిసారి నీతో రాలేదు. ఓ యూ బికం సో టాల్' అంది దీప సంతోషంగా తన యీడు అమ్మాయి కంపెనీ వుంటుందని సంబరపడింది.

అమెరికాలో ఆ నాల్గు వరసల రోడ్లు, బారులు తీరి రయ్యిన దూసుకుపోతున్న కార్లు దీప ఆశ్చర్యంగా చూస్తుంటే హరిత కారులో వున్నంతసేపు మాట్లాడుతూనే వుంది. చూసిన కాసేపట్లోనే మంచి ఫ్రెండ్లీ నేచర్ అని, సరదా అయిన అమ్మాయిని తెల్సిపోయింది దీపకి.

ఇల్లు చేరగానే మాలతి, 'హరితా! దీప సామాన్లు నీ బెడ్‌రూములో పెట్టు. దీపా, యూ బోత్ హావ్ టూ షేర్ ఏ రూమ్' అంది. దీప కాస్త యిబ్బందిగా హరిత వంక చూసింది.

'హరితకి అభ్యంతరం...తన కిబ్బంది'

'ఓ నాటెటాల్. నాకేం యిబ్బంది లేదు, కమెలాంగ్' పెద్ద పెద్ద పెట్టెల రెండూ యీడుస్తూ గది వైపు వెళ్లింది.బ్యాగులు భుజాన తగిలించుకుని దీప వెనక నడిచింది.

'ఇబ్బందైనా కాకపోయినా యిద్దరూ సర్దుకోవాలి మీరు. మా యింట్లో మూడే బెడ్ రూములు మరి, యిక్కడో గది, మాదో గది అంటూ మాలతి వార్డ్‌రోబ్ అది చూపిస్తూ, 'నీ సామాన్లు దీన్లో సర్దుకో - ఫ్రెష్ అయి రా భోంచేద్దాం' అంది లోపలికి వెళుతూ.

గది పెద్దదే - అన్ని సదుపాయాలు, ఎటాచ్ బాత్ అన్ని సదుపాయాలు వున్న ఆధునిక యిల్లు - యిండియాలోనే వున్నప్పుడు ఇక్కడ వుండడంలో వింత ఏముంది అనుకుంది. దీప పెట్టెలో తెరిచి తండ్రి పంపిన బహుమతులు, తల్లి పంపిన స్వీట్లు, పచ్చళ్ళు తీసిపెట్టింది. హరిత చకచక మాట్లాడుతూ బట్టలు అవి కప్‌బోర్డ్‌లో సర్దేసి పెట్టెలు, బ్యాగులు కప్‌బోర్డుపైన పడేసింది. హరిత మంచి పనిమంతురాలు. చాలా స్మార్ట్‌గా, కలివిడిగా గలగల మాట్లాడే అమ్మాయిని వింతగా చూసింది దీప.

ఉన్న పది రోజుల్లో హరిత దీపని వెంటబెట్టుకుని చుట్టుపక్కల మాల్స్, షాపులు, చూడాల్సినవి చూపింది. ఓ రోజు మాలతి దీపని వెంటబెట్టుకుని యూనివర్సిటీ తీసికెళ్ళి సబ్‌మిట్ చేయాల్సిన కాగితాలు, కట్టాల్సిన డబ్బు అవి కట్టించింది. అక్కడ యిండియా నించి వెళ్ళిన సీనియర్స్‌ని కల్సి దీప వుండడానికి అపార్ట్‌మెంట్ గురించి వాకబు చేసింది. అప్పటికే ముగ్గురు ఇండియా నించి వెళ్ళిన ఫ్రెషర్స్ ఇద్దరు సీనియర్స్ అపార్ట్‌మెంట్ తీసుకున్నారని అక్కడికి వెళ్ళి మాట్లాడి దీప వాళ్ళతో కల్సి వుండడానికి ఏర్పాటు చేసి అపార్ట్‌మెంట్‌కి డబ్బు అది కట్టింది. ఒక తమిళ అమ్మాయి, ఒక పంజాబి, ఒక తెలుగమ్మాయి - తెలుగు అమ్మాయి , దీప ఓ రూము షేరు చేసుకోవాలి. రెండో బెడ్‌రూములో మిగతా యిద్దరు - కామన్ డ్రాయింగ్ రూము, కిచెన్, రెండు బాత్‌రూములున్న ఫ్లాట్ అది. అమ్మాయిలు నలుగురూ కల్సి వండుకుని, ఖర్చులు షేర్ చేసుకుని, పని పంచుకోవాలి. ఫ్రిజ్, కుకింగ్ రేంజి వగైరాలు అపార్ట్‌మెంట్‌లోనే వుంటాయి. అపార్ట్‌మెంట్ బేస్‌మెంట్ వాషింగ్‌మెషీన్లుంటాయి. కామన్‌గా - ఎవరికి కావల్సినపుడు వాళ్ళు బట్టలుతుక్కోవచ్చు. అన్ని వివరాలు చూపించి తీసుకొచ్చింది మాలతి - ఇండియా నించి వచ్చిన అమ్మాయిలు, అందులో తన రూమ్‌మేట్ తెలుగమ్మాయి అనగానే సగం బెంగ తీరింది - మేనకోడలిచేత బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయించి ఖర్చులకి డాలర్లు వేసి చెక్‌బుక్ యిచ్చింది. యివన్నీ చూపించి చేయిస్తుంటే 'అమ్మో, అత్తయ్య లేకపోతే ఎంత యిబ్బంది అయ్యేది' అని అనుకోని క్షణం లేదు దీప-

యూనివర్సిటీ ఓపెన్ అయ్యాక మళ్ళీ సామాను తీసుకొచ్చి అపార్ట్‌మెంట్‌లో దింపి యూనివర్శిటీ సీనియర్స్‌కి అప్పచెప్పి జాగ్రత్తలు చెప్పి వెళ్లింది. దీప బిడియంగా, సిగ్గు పడ్తూ కృతజ్ఞతలు చెప్పింది. 'డోంట్ బీ సిల్లీ, నా మేనకోడలికి ఆ మాత్రం చెయ్యనా' అంది తేలిగ్గా మాలతి.

కొత్త పరిసరాలు, కొత్త వాతావరణం, కొత్త భాష, కొత్తమొహాలు, కొత్త సంస్కృతి మధ్య మాలతి చేసిన సాయం తక్కువనిపించలేదు-మిగతా సగం సీనియర్ అమ్మాయిలిద్దరూ తన కొత్త పోగొట్టి చదువుకోవాల్సిన పద్ధతులు, లైబ్రరీ నించి తెచ్చుకోవాల్సిన పుస్తకాలు, ఇంట్లో పంచుకోవాల్సిన పనులు, దగ్గరలో వున్న బేకరీలు, షాపులు అవి చూపించి అన్ని విధాల సాయంచేసి తమలో కలుపుకున్నారు. దీప సెటిల్ అయ్యేవరకు మాలతి రెండు రోజులకోసారి ఫోను చేసి వివరాలు అడిగేది - ఒక నెల రోజులయ్యేసరికి రొటీన్‌గా చదువులో పడింది. దీప రెండు మూడు రోజులు శలవులు కలిసివస్తే మాలతి యింటికి వెళ్లేది.

* * *

క్రిస్మస్ శలవులకి దీప వెళ్ళేసరికి అక్కడ మార్గరెట్ అన్న అమ్మాయి హరిత స్నేహితురాలుంది - క్రిస్మస్ గడపడానికి వచ్చిందని మార్గరెట్‌ని పరిచయం చేసింది హరిత. ఆ శలవులు ముగ్గురూ కలిసి హరిత కారులో తిరిగారు-పిక్నిక్కులు, హోటళ్లు, డిస్కోలు తిరగని చోటు లేదుప మార్గరెట్ మంచి పొడుగు. కోటేరేసి నట్టు సన్నని ముక్కు, నీలి కళ్ళు - చక్కని ఆ మొహంలో...ఎంత నవ్వుతూ తిరిగినా ఆ నీలి కళ్ళల్లో కదలాడే నీడ లాంటి మబ్బులు ఎవరి దృష్టినీ దాటిపోవు.

'అంటీ, మార్గరెట్ కిస్మస్ శలవులు యిక్కడ గడువు తూంది. పేరెంట్స్ దగ్గరికి వెళ్లదా, తనకి ఎవరూ లేరా?'' అంది కుతూ హలంగా -

వంటింట్లో దోసెలు వేస్తోంది మాలతి. 'లేకపోవడం ఏం అంతా నిక్షేపంలా వున్నారు. తల్లి తండ్రి యిద్దరూ డైవర్సు తీసుకుని వేరే పెళ్లిళ్ళు చేసుకున్నారు. తల్లి దగ్గర సవతి తండ్రి, తండ్రి దగ్గర సవతి తల్లి - వయసు వచ్చిన పిల్ల, కొత్త చోట కొత్త మనుష్యుల మధ్య యిమడలేక పోతుంది. చిన్నప్పుడు అయితే ఎలాగో సర్దుకునేదేమో, అందుకే అందరూ వున్నా వంటరి దయింది. పూర్ గర్ల్...మేగి అంటే మా అందరికి జాలి - చాలా మంచి పిల్ల - శలవులొస్తే హరితతోపాటు యిక్కడే గడువుతుంది' అంది మాలతి.

'దీపా, చూశావా యిక్కడికి మనకి తేడా. పిల్లల కోసం తల్లితండ్రి ఎన్ని మనస్పర్ధలున్నా - ఎంత బేధాభిప్రాయాలు వచ్చినా పిల్లలని దృష్టిలో పెట్టుకొని వాళ్ళ

కోసం ఎంతో త్యాగం చేస్తారు యిండియన్స్ - యిక్కడ ఎవరి సుఖం వారిదే యింకొరి కోసం బతకరు మనలాగ''

దీప సాలోచనగా చూసింది. నిజమే...కాని ఎందులో సుఖం వుంది! ఏ పద్ధతి మంచిది అన్న సందిగ్ధంలో పడింది.

క్రిస్మస్ నాడు మేగితోపాటు దీప, హరిత యిద్దరు కూడా చర్చికి వెళ్ళి వచ్చారు. మాలతి అందరికి చిన్న చిన్న గిఫ్టులు కొని ఇచ్చింది. మేగి కళ్ళల్లో నీటి పొర - 'థాంక్స్ ఆంటీ' అంటూ మాలతిని కౌగలించుకుంది. గదిలో ముగ్గురు కబుర్లు చెప్పుకుంటూంటే మార్గరెట్ చాలా ఎమోషనల్‌గా మాట్లాడింది.

'నిజంగా హరితతో నాకు స్నేహం అవడం నా అదృష్టం. మిమ్మల్నిద్దరిని చూస్తుంటే నాకు నిజంగా జెలసీగా వుంది. మీ ఫేమిలిని కల్సివుండకపోతే నా కసలు బంధుత్వాలు, అభిమానాలు, అనురాగాలు ఎలా వుంటాయో తెలిసేదే కాదు, కజిన్స్ అన్న పదానికి అర్థమే తెలిసేది కాదు. నిజంగా మీ యిండియన్స్ ఎంత అదృష్టవంతులు. ఒకరి పట్ల ఒకరికి యింత ప్రేమ, అభిమానాలు, అనురాగాలు వుంటాయి. అక్కలు, చెల్లెలు, అన్నదమ్ములు, అంకుల్స్, కజిన్స్, గ్రాండ్ పేరెంట్స్ యిన్ని రకాల వరసలు పిల్చుకుంటూ ఒకరి పట్ల ఒకరు ఆప్యాయతలు కలబోసుకుంటారు. సాయాలు చేసుకుంటారు.. మాలతి ఆంటీ అన్న కూతురి కోసం ఎంత చేస్తూంది. అమ్మా నాన్న కనిపారేసి చేతులు దులుపుకోకుండా పిల్లల్ని పెంచి పెద్దచేసి, చదివించి, పెళ్ళిళ్ళు చేసి, పురుళ్ళు పోసి మనవలతో ఆడుకుంటూ, మనవల ముచ్చట్లు చూస్తూ ఒకరి ఇంటికి ఒకరు రాకపోకలతో సంబంధాలుంచుకుని...ఓహో...ఎంత గొప్ప అనుబంధాలు మీవి - మా తల్లిదండ్రులు రెక్కలొచ్చేక పక్షులు పిల్లల్ని గూట్లోంచి తోసేసినట్లు మేం కాస్త పెద్దవగానే మరి పట్టించుకోకుండా వదిలేస్తారు. మేం చదివినా పట్టించుకోరు. చదవకపోయినా బాధ పడరు. ఎవరితో తిరిగినా పట్టించుకోరు. ఎవర్ని పెళ్ళిచేసుకున్నా మా యిష్టానికి వదిలేసి కల్పించుకోరు. మా పురుళ్ళు మేమే పోసుకోవాలి. పిల్లల్ని మేమే పెంచుకోవాలి-ఏ సాయం వుండదు మాకు...నిజంగా హరీ, దేముడనే వాడు వుంటే మళ్ళీ జన్మలోనైనా యిండియాలో పుట్టించమని కోరుకుంటాను' - చాలా ఎమోషనల్‌గా అంది.

'ఏయ్ మేగి సెంటిమెంటల్ ఫూల్‌లాగ అవకు. నీ కెవరు లేరని ఎందుకనుకుంటావు. నేనున్నాను' అంది హరిత మేగిని దగ్గరకు లాక్కుని బుగ్గమీద ముద్దుపెట్టింది.

'ఐనో, యు ఆర్ మై ప్రెషస్ ఫ్రెండ్, నీ స్నేహమే లేకపోతే నేనేమయ్యేదాన్ని'

దిగులుగా అంది మేగి.

'ఎక్స్యూజ్ మీ మేగీ, మీలో ఇలా బంధుత్వాలు, కల్సుకోడాలు వుండవా? ఒకరి ఇళ్ళకి ఒకరు వెళ్లరా? బ్రదర్స్, సిస్టర్స్, అంకుల్స్, ఆంట్స్ అంతా కల్సుకోరా? జస్ట్ తెల్సుకోవాలని కుతూహలంగా అడుగుతున్నాను' దీప అంది.

'మాకు ఫ్యామిలీ అంటే భర్త, భార్య, పిల్లలు మాత్రమే! మిగతా బంధుత్వాలుం టాయి కాని యిలా రాకపోకలుండవు - మా కమ్యూనికేషన్ అంతా క్రిస్మస్, న్యూ యియర్‌కి కార్డులు పంపుకోడం, విష్ చేసుకోవడం వరకే. ఎవరన్నా ఎవరింటికన్నా వెళ్లాలనుకుంటే ముందు పర్మిషన్ అడిగి వాళ్ళు రమ్మంటే వెళ్ళాలి. వాళ్ళకి వీలున్నప్పుడు లంచ్‌కీ, డిన్నరుకీ ఆహ్వానిస్తారు. మూడొంతులు ఏ హోటల్‌కో తీసుకెడతారు. మీలా యిలా ఇళ్ళల్లో ఎప్పుడూ పడితే అపుడు ఎవరొచ్చినా యింట్లో గృహిణి వండి వార్చదు. పుట్టింరోజులకి, పండగలకి విష్ చేసి చిన్న గిఫ్ట్ యిచ్చుకుంటాం-పెళ్ళిళ్ళయితే చర్చికి వెళ్ళి పెళ్ళి అటెండయి లంచ్ తిని రావడమే' విశదీకరించింది మార్గరెట్.

"మీ పేరంట్స్ డైవర్స్ తీసుకున్నారన్నావు. మరి నీ బాధ్యత ఎవరిది. యింక నీ చదువు అవాలిగదా. శలవలకి వస్తే ఎక్కడికి వెడతావు' కుతూహలంగా ఆరా తీసింది దీప.

'మమ్మీ డాడీలు డైవర్స్ తీసుకున్నాక నాకో యిల్లంటూ లేదు దీపా. శలవులు వస్తే మళ్ళీ రా అంటుంది. కాని అక్కడ కొత్త నాన్న, కొత్త యిల్లు, కొత్త అలవాట్లు, పరిసరాలు - నాకు ఒకసారి వెడితే చాలా ఎంబ్రాసింగ్‌గా వూపిరి ఆడనట్లనిపించింది. అమ్మకి భర్త అవుతాడు కాని నాకు నాన్న ఎలా అవుతాడు - అందుకే యింత పెద్దయ్యాక ఎలా ఎడ్జస్ట్ అవను. అందుకే శలవలకి వెళ్ళను.

'మరి నీ పోషణ, ఖర్చు -'

'డైవర్సు పుచ్చుకున్నాక నా పోషణ నేను సెటిల్ అయ్యేవరకు డాడీ బాధ్యత. నెల నెలా డబ్బు పంపిస్తారు - అపుడపుడు ఫోను చేస్తారు - ఎప్పుడైనా యిక్కడికి వస్తే కలుస్తారు అంతే' - మార్గరెట్ మాటలు వింటూంటె ఆ పరిస్థితి వూహించడానికే దీపకి భయం అన్పించింది. ఎంత నిస్సహాయ దుస్థితి! ఈ విషయంలో నిజంగా తమెంత అదృష్టవంతులు! తమదెంత నిష్పూచి జీవితం - తల్లి తండ్రి పిల్లల్ని కళ్ళలో పెట్టుకొని కాపాడుకుంటారు. ఎన్ని కష్టాలు పడీ, త్యాగాలు చేసీ డబ్బు తెచ్చి చదివిస్తారు. మంచి సంబంధాలుచూసి పెళ్ళి చేస్తారు. వారున్నన్ని రోజులు పురుళ్ళు, పుణ్యాలు, పండగలు, పబ్బాలు అంటూ పిలుస్తూ తమ చేతనయినంత చేస్తూ, ఆస్తులు కూడపెట్టి పిల్లలకి

యివ్వాలని తాపత్రయపడ్తారు. వీళ్ళేంటి పక్షులు రెక్కలు రాగానే గూట్లోంచి తోసేసినట్లు తోసేస్తారు. చదువుతావో, ఉద్యోగం చూసుకుంటావో, ఎవరితో తిరుగుతావో, ఎవరిని పెళ్లిచేసుకుంటావో నీ యిష్టం అన్నట్టు పట్టించుకోరట - అదే మన వాళ్లయితే పిల్లల్ని సరి అయిన దారిలో పెట్టాలని ఎంత తాపత్రయపడ్తారు. ఏ అనామకుడ్ని చేసుకుంటుందో అని ఎంత బాధపడి పోతారు'

తన ఆలోచనలలో వచ్చిన మార్పుకి తనే ఆశ్చర్యపడింది దీప. యిదే యిదివర కయితే అబ్బ ఎంత హాయి, ఎంత ఫ్రీడం, వాళ్లకి, మన వాళ్ళు ఎంత కట్టడి చేస్తారు వయసొచ్చినా అనుకుని అసంతృప్తిగా తిట్టుకునేది. అమెరికా వచ్చాక, వయసు తెచ్చిన పరిణతతో ఆలోచిస్తుంటే యీ పద్ధతుల కంటే మనవే మంచివన్న భావం బలపడింది.

ఈ మాటలు మాలతి దగ్గర అనకుండా వుండలేకపోయింది దీప - 'పోనీలే, యిప్పటికయినా నీ కర్థం అయింది. మన యిండియన్స్ సెంటిమెంట్స్ ఎంత గొప్పవో, మన కుటుంబ వ్యవస్థ ఎంత పటిష్టమైందో, మన రాకపోకలు బంధుత్వాలని పెంచుతాయి. ఆత్మీయతల్ని బలపరుస్తాయి. మనిషి సెంటిమెంటుకి బానిస. ఆ భావనే లేకపోతే మనిషికి పశువుకి తేడా ఏముంటుంది దీపా - అవసరంలో ఆదుకునేది మనవాళ్ళు అన్న వాళ్ళు. తల్లి, తండ్రి చిన్నతనాన, అక్కలు, అన్నలు కాస్త పెద్దయ్యాక, పెళ్ళయ్యాక భర్త, వయసుడిగాక పిల్లలు, యిలా మనకి ప్రతి స్టేజీలో మనకో తోడు, ఆసరా వున్నారన్న భావన ఎంత ఊరటనిస్తుంది.

ఈ రోజుల్లో మన వెనకటి తరాలకన్న బంధుప్రీతి, అభిమానాలు తగ్గాయి అంటే ఆర్థిక పరిస్థితులు. పట్టణాలలో చిన్న సంసారాలు, చిన్న యిళ్లు, ఉద్యోగస్థులైన గృహిణులు కారణాలు. ఏమయితేనేం యిదివరకటి అనుబంధాలు తగ్గినా మనం యింకా యీ మాత్రం వున్నామంటే మన యిండియన్స్‌కున్న బంధుప్రీతి, మన కుటుంబ వ్యవస్థ యింకా పటిష్ఠంగా వుందంటే భార్యభర్తలు పిల్లల కోసం, ఎన్ని యిబ్బందులు, కష్టాలెదురయినా వివాహ వ్యవస్థని గౌరవించి కల్సి బతకాలనుకోడమే.

దీపా.. అమ్మా నాన్న అంటే - కన్నారు కాబట్టి కావల్సినవి సమకూర్చాలి అనుకునే తత్వం మీ యువతలో ప్రబలుతూంది. ఏదో ఒకరు యిద్దరు పిల్లలని అడిగినవన్ని సమకూర్చి చక్కగా చదివించి మీ భవిష్యత్తుకి బంగారు బాట వేద్దామనుకునే వారి ప్రేమని, త్యాగాన్ని అర్థం చేసుకోవాలి. హక్కులు కావాలంటే బాధ్యతలూ తీసుకోవాలి. మిమ్మల్ని కష్టపడి పైకి తెచ్చిన తల్లి దండ్రులు వృద్ధాశ్రమాల పాలుకాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీది. మీ యువతరంలో ఫారెనర్స్ మాదిరే ఫామిలీ అంటే

భార్యా, భర్త, పిల్లలు అనుకునే స్వార్థం పెరుగుతోంది. మాకెవరూ అక్కరలేదనుకుంటే అనుబంధాలు నశిస్తాయి. ఆప్యాయతలు అంతరించిపోతాయి. కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నమవుతుంది. దాంతో సామాజిక స్థితిగతుల రూపే మారిపోతుంది.

దీపా యిక్కడ యువత పెడతోవ పట్టడానికి కారణాలు తాము ఎవరికి అఖ్ఖరలేదన్న నిర్లిప్తత, నిస్పృహ, చూసేవారు లేక ఆప్యాయతలు, అనురాగాలు కరవైతే అదోరకం విరక్తి నింపుతుంది. ఈ దుర్దశ మనకు, మన పిల్లలకి రాకూడదు అంటే మనిషికి మనిషికి మధ్య ఆప్యాయతలుండాలి. మాట మంతి, అభిప్రాయాలు కలబోసుకోడం, కుటుంబం అంతా కూర్చొని కనీసం ఒకపూట భోజనం చెయ్యడం వుండాలి. నేను నా పిల్లలకి ముందు నించి యివన్నీ నూరిపోశాను. అందుకే వాళ్ళు బంధువులంటే, స్నేహితులంటే ప్రాణం పెడతారు. మనిషి అయినందుకు కమ్యూనికేషన్ వుండాలి దీపా.

వంటరిగా గదుల్లో కూర్చుని, కంప్యూటర్లలో ఇ-మెయిల్లో ఛాటింగులు, బ్రౌజింగ్‌లు, చేసుకుంటూ, టి.వి.లు చూసుకుంటూ వంటరితనానికి అలవాటు పడిపోతుంది ఈ యువతరం. ఇది మంచి పరిణామం కాదు దీపా. విదేశాల్లో మాదిరి మన యువతా దీనికి అలవాటు పడిపోతే యిదీ ఒకరకం వైరస్సే. ఇదీ ఎయిడ్స్ అంతటి మహమ్మారే! ఎయిడ్స్ స్లోగా ఎలా శరీరం అంతా వ్యాపించి శరీర వ్యవస్థని దెబ్బతీస్తుందో, మీ యీ వంటరితనమూ మనిషిని అనుభూతుల నించి క్రమంగా నిర్వీర్యం చేస్తుంది. దీపా యీ కంప్యూటర్ నీ వంటరితనాన్ని తాత్కాలికంగా తగ్గించగలదు కానీ నీ వ్యథ పంచుకోదు-నీ సంతోషం పంచుకోదు. నీకు కావల్సినపుడు ఆదుకోదు. 'మేం వున్నాం నీకు' అనే మనిషి ప్రతి స్టేజిలోనూ మనకి కావాలి అన్నది మరవద్దు. నా కోసం బాధపడే వారున్నారు-తల్లీ, తండ్రీ, భర్త, పిల్లలూ-ఎవరన్నా కాని, ఆ భరోసా మనిషికి ఎంత బలం యిస్తుందో నీకు తెలియాలి. దయచేసి యీ వైరస్ నించి మానవ సంబంధాలు కాపాడి పునరుద్ధరించండి. కుటుంబ వ్యవస్థని కాపాడవలసిన బాధ్యత మీ యువతరానిదే దీపా'-ఎమోషనల్‌గా అన్న మాలతి మాటలని మనస్ఫూర్తిగా మనసులోనే దీప అంగీకరించింది.

'ఆంటీ, నీ మాటల్లో నిజం నాకిప్పటికే అర్థం అయింది. ఈ అమెరికా వచ్చాక నీవే లేకపోతే అన్నది నాకు ఎప్పుడో అర్థం అయ్యింది అత్తయ్యా'-మాలతిని మనసారా కౌగలించుకుని అంది దీప.

◆ "తెలుగు పలుకు" - తానా రజతోత్సవ సంచిక -2003 సౌజన్యంతో